37 కేంద్రాల్లో నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18 న జరిగే ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 37 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వీటిలో కాకినాడ జిల్లాలో 14, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 16, తూర్పు గోదావరి జిల్లాలో 7 పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు 8,971 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆ రోజు ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని, అభ్యర్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరు కావాలన్నారు. హాల్ టికెట్లను నవోదయ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు.

బరుల ఏర్పాటులో పోటాపోటీ

- వేర్వేరుగా సిద్ధం చేస్తున్న జనసేన, టిడిపి నాయకులు
- ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నం

సామర్లకోట మండలం పనసపాడులో సిద్ధమవుతున్న భారీ బరి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ ఏడాది కూడా కోడిపందేల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నేపథ్యంలో కోడిపందేల్లో పైచేయి సాధించేందుకు జనసేన, టిడిపి నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వేరువేరుగా బరులను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఏర్పాట్లలో ఈ రెండు పార్టీల నేతలు నిమగ్నమయ్యాయి. పోలీసులు, రెవెన్యూ అధికారుల హెచ్చరికలను పక్కన బెట్టి కూటమి నేతలు బరుల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్, గోపాలపురం, నల్లజర్ల, తాళ్లపూడి, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం, కాకినాడ జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట, తొండంగి, కరప, కాజులూరు, కాకినాడ రూరల్, కోనసీమ జిల్లాలో మండపేట, ద్వారపూడి, అంబాజీపేట, రాజోలు, మలికిపురం, మామిడికుదురు, అయినవిల్లి, పి.గన్నవరం, కొత్తపేట, అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, రామచంద్రపురం మండలాల్లో ఏటా కోడి పందేలు భారీగా జరుగుతాయి.

పోటాపోటీగా ఏర్పాట్లు

ఈ ఏడాది కూడా భోగి పండగ నుంచి మూడు రోజుల పాటు కోడి పందేల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు సాగిస్తున్నారు. గతేడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 230 బరుల్లో పందేలు జరగ్గా దాదాపు రూ.250 కోట్లు చేతులు మారాయి. ఈ సారి కూటమి నేతలు సంక్రాంతి పండుగను క్యాష్ చేసుకోవడానికి కొన్ని రోజులుగా ప్రణాళికలు వేస్తున్నారు. దీంతో బరుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో టిడిపి, జనసేన నాయకులు వేర్వేరుగా బరులను సిద్ధం చేస్తున్నారు. ఈనెల జనవరి ఒకటిన నూతన సంవత్సర వేడుకల్లో టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ కోడి పందేలను నిర్వహించి కొత్త సంప్రదాయానికి తెర లేపారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి కొత్త సంవత్సరం కావడంతో తమ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపే కార్యక్రమం పేరుతో పందేలు ప్రారంభించడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో తామే బరులను ఏర్పాటు చేస్తామంటూ జనసేన కార్యకర్తలు చెబుతున్నార. పిఠాపురం పట్టణంలో స్థానిక వైఎస్ఆర్ గార్డెన్‌లో టిడిపి, జనసేన వేర్వేరుగా బరుల ఏర్పాటుకు పనులు సాగిస్తున్నారు. అలాగే నిమ్మకాయల నరాజప్ప ప్రాతినిధ్యం వహిస్తున్న పెద్దాపురంలోనూ రెండు పార్టీల నేతలు పోటాపోటీగా పందేల నిర్వహణకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సామర్లకోట మండలం వికె.రాయపురం, మేడపాడు, చంద్రంపాలెం, ఉండూరు, మాధవపట్నం తదితర గ్రామాల్లో వేర్వేరుగా బరులు సిద్ధం చేస్తున్నారు. జనసేన ఎంఎల్‌ఎ పంతం నానాజీ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ రూరల్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలో కొత్తూరు, పెనుమర్తి, వలసపాకల, తిమ్మాపురం, రమణయ్యపేట, గైగోలపాడుల్లో బరుల కోసం స్థలాలను సిద్ధం చేశారు. రాజోలు నియోజకవర్గం లాంటి కొన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులతో పాటు వైసిపి నాయకులు సైతం కుమ్మక్కై బరులను ఏర్పాటు చేస్తున్నారు.

వికె.రాయపురంలో బరి వద్ద జనసేన జెండాతో కార్యకర్తలు

మందు, విందులకు ప్రత్యేక ఏర్పాట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటవుతున్న బరుల వద్ద మందు, విందుకు సైతం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వీటి నిర్వహణ కోసం కొన్ని బరుల వద్ద ఇప్పటికే వేలం నిర్వహించనట్టు సమాచారం. భారీ బరువల వద్ద వేలం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఖరారైనట్టు సమాచారం. అక్కడ మద్యంతో పాటూ బిర్యానీ, ఇతర ఆహార పదార్థాలు, సిగరెట్లు, కూల్ డ్రింక్స్ వంటివి అమ్ముకునేలా వేలాలు ఖరారు చేశారు. అంతేకాకుండా కోస మాంసం చేసేందుకు, అక్కడే వండి పెట్టేందుకు సైతం నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు.

హైటెక్ హంగులు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు, కాట్రేనికోన, ఐ.పోలవరం, కాకినాడ జిల్లా తాళ్లరేవు, ముమ్మిడివరంలో భారీ బరుల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మూడు రోజుల పాటు 24 గంటల పాటు పందేలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా విఐపి గేలరీలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి పందెం అందరికీ కనపడేలా ఎల్ఇడి స్క్రీన్లను సైతం ఏర్పాట్లు చేసేలా నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. ఆత్రేయపురం, రావులపాలెం, రాయవరం, కపిలేశ్వరపురం తదితర మండలాల్లో పందేలు కూర్చొని చూసేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తప్పు చేస్తే క్షమించేది లేదు

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

సభలో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

తప్పు చేస్తే ఎంతటి వారినైనా క్షమించేది లేదని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ అన్నారు. శుక్రవారం ఆయన కాకినాడ జిల్లా పిఠాపురం నియోజక వర్గంలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భగా పిఠాపురంలోని రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన పల్లెపండుగ వారోత్సవ సభలో పాల్గొని మాట్లాడారు. తిరుపతి తొక్కిసలాట ఘటన బాధాకర మన్నారు. దీనికిపై టిటిడి ఇఒ, పాలకమండలి క్షమాపణ చెప్పాలన్నారు. గత పాలకులు రంగులు వేసి అదే అభివృద్ధి అన్నారని విమర్శించారు. తమ హయాంలో గ్రామ సభలు నిర్వహించి రికార్డ్ స్థాయిలో రూ.4500 కోట్ల పనులకు అనుమతి తెచ్చామని గుర్తు చేశారు. పిఠాపురం నియోకవర్గానికి జాతీయ స్థాయిలో పేరు వచ్చేలా అభివృద్ధి చేస్తానన్నారు. తాను పనిచేస్తేనే తరువాత ఎన్నికల్లో గెలిపించాలని లేకుంటే ఓటు వేయొద్దని ప్రజలకు సూచించారు. ఇటీవల కాకినాడ జిల్లాలో క్రైం రేటు పెరిగిందన్నారు. పోలీసులు ఉదాసీనత వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఈవ్‌టీజింగ్ చేసే వారికి ఉపేక్షించరాదన్నారు. పిఠాపురంలో మరోమారు ఈవ్‌టీజింగ్ మాట వినపడదన్నారు. పోలీస్ స్టేషన్లలో విఐపి ట్రీట్‌మెంట్లకు స్వస్తి చెప్పాలని పోలీసులకు సూచించారు. పోలీస్ స్టేషన్లలో లాయర్లతో సెటిల్‌మెంట్లు పెట్టకండి అంటూ పోలీసులకు హితవు పలికారు. ప్రతి గ్రామంలోనూ త్వరలో పర్యటిస్తానన్నారు. రూ.2.08 లక్షల కోట్ల పెట్టుబడిని ఇచ్చిన మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

6 నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 12,500 మినీ గోకులం షెడ్లను నిర్మించామని తెలిపారు.కుమారపురంలో రూ.1.85 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్‌ను ఆయన ప్రారంభించారు. పాడి రైతులకు అందిస్తున్న సదుపాయాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను, పిఠాపురం నియోజకవర్గంలో ఇప్పటి వరకు పూర్తి చేసిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన పోస్టర్‌ను పరిశీలించారు. పిఠాపురం పట్టణంలోని ఒబిఎస్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ స్టాల్లో పందెం పుంజు, మేకలతో పాటు పుంగనూరు ఆవు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అటవీ శాఖ స్టాల్లో ఆలివ్ రిడ్లీ తాబేలుతో పాటు వివిధ రకాల పక్షుల నమూనాలను తిలకించారు. ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మరణాలకు కారణాలపై ఆరా తీశారు.

అడుగడుగున ఆంక్షలే... వెనుదిరిగిన కూటమి నేతలు

పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా ఆంక్షలు పెట్టారు. దీంతో ప్రజలతో పాటు కూటమి నాయకులు సైతం ఇబ్బందులకు గురయ్యారు. ఎక్కడికి అక్కడ భారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ట్రాఫిక్‌ను మళ్లించడంతో సామాన్య ప్రజలతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. సభ వేదిక వద్దకు వెళ్ళెందుకు జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ చల్లా లక్ష్మి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.ఈ నేపథ్యంలో ఆమె కింద పడిపోయారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్మ తన అనుచరులతో సభ ప్రాంగణం ముఖ ద్వారం వద్దకు చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. జెసి రాహుల్ మీనా చేరుకుని వర్మకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. వర్మ తోపాటు కొద్ది మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.కృష్ణంరాజు మరి కొంతమంది బిజెపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కృష్ణంరాజును మాత్రమే లోనికి అనుమతించారు. దీంతో మిగిలిన వారు అక్కడ నుంచి వెనుదిరిగారు.

పనులను పరిశీలిస్తున్న మంత్రి పవన్ కల్యాణ్

ఎడిబి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం నుంచి పిఠాపురం పర్యటనకు వెళ్తూ మార్గం మధ్యలో రామస్వామిపేట వద్ద ఎడిబి రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణం ఎప్పుడు ప్రారంభం అయ్యింది, ఎంత వరకూ పూర్తయ్యింది, ప్రస్తుతం పనులు ఎలా సాగుతున్నాయనే వివరాలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రెయిన్ సౌకర్యం, నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఇటీవల గేమ్ ఛేంజర్ ప్రి రిలీజ్ ఈవెంట్ సమయంలో వడిశలేరు వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అభిమానులు ప్రాణాలు కోల్పోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదానికిగల కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

కార్టూన్‘నిజం’

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దారు రాగూర్

తహశీల్దార్ రాగూర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కాజులూరు

కాజులూరు తహశీల్దారుగా రాగూర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒగా రాగూర్ పని చేస్తూ బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన రాగూర్‌ను రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేగేశ్వరరావు డిటి శ్రీనివాస్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు, సత్యనారాయణ, రాధాకృష్ణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

కార్మికులకు యూనిఫారాలు పంపిణీ చేస్తున్న ఛైర్‌పర్సన్

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -సామర్లకోట

సంక్రాంతిని పురస్కరించుకుని సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో పబ్లిక్ హెల్త్ నాన్ పబ్లిక్ హెల్త్ కార్మికులకు శుక్రవారం యూనిఫారం దుస్తులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ పంపిణీ చేశారు. మహిళలకు మూడు చీరలు, మూడు తువాళ్లు పురుషులకు రెండు జతల దుస్తుల చొప్పున 300 మందికి పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఊబా జాన్ మోజెస్, మున్సిపల్ కౌన్సిలర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణను మెరుగు పర్చాలి

ప్రజాశక్తి-పిఠాపురం

మున్సిపాలిటీ పరిధిలోని పారశుధ్య నిర్వహణను మెరుగు పరచాలని 2, 3, 4 వార్డుల అభివృద్ధి కమిటీ కన్వీనర్ కరణం విశ్వనాథం ఒక ప్రకటనలో కోరారు. పవన్ కల్యాణ్ పర్యటనలో భాగంగా మూడు రోజులుగా పారిశుధ్య కార్మికులు పగలూ రాత్రీ పవన్ కళ్యాణ్ పర్యటించే ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరుస్తున్నారే తప్ప మిగిలిన ప్రాంతాలను పట్టించుకోలేదని విమర్శించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మూడో వార్డులో ఉన్న వినాయకుడి ఆలయ సమీపంలో శుభ్రం చేయమని స్థానిక ప్రజలు, కౌన్సిలర్ ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంఎస్‌ఎన్ చారిటీస్ ఇఒ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి అన్నారు. స్థానిక జగన్నాథపురం ఎంఎస్‌ఎన్ చారిటీస్‌లో సిబ్బంది, విద్యార్థులు ఆనందోత్సాహాలతో సంక్రాంత్రి సంబరాల్లో పాల్గొన్నారు. బొమ్మలకొలువు, రంగవల్లులు, గొబ్బెమ్మలు, భోగిమంట, హరిదాసులు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలకు ఇఒ బహుమతులు ప్రదానం చేసారు. ఎంఎస్‌ఎన్.డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.ఉషారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయలక్ష్మి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శంఖవరం కత్తిపూడిలోని మాధురి విద్యాలయంలో విద్యాలయం ఛైర్మన్ పడారి తమ్మయ్య బాబు, సీతాదేవి దంపతులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామర్లకోట ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో కరస్పాండెంట్ ఎస్‌వివిజి.ప్రకాష్, పాఠశాల డైరెక్టర్ సుధారాణి ప్రకాష్ వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీగౌరి పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని కోరింగ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించిన ఈ సంబరాలను కళాశాల ఛైర్మన్ దున్నా జనార్ధన రావు, కరస్పాండెంట్ ప్రగళ్లపాటి కనకరాజు, డైరక్టర్లు చిట్టూరి కలికిమూర్తి భోగిమంట వెలిగించి ప్రారంభించారు. పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సువర్ణ జ్యోతి, పాఠశాల హెచ్‌ఎం ఉమ, కొమ్మూరి మాలతి పాల్గొన్నారు. పోలేకుర్రు పంచాయతీలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బల్ల సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి ఎన్.జ్యోతి సుధ, ఉప సర్పంచ్ దడాల గణేష్, మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు, వనమాడి రాంబాబు, బత్రాజు నరసయ్య, సమ్మిడి వీర్రాజు పాల్గొన్నారు.

తాళ్లరేవు సంక్రాంతి సంబరాలను సత్యసాయి హైస్కూల్‌లో ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. హైస్కూల్ ప్రిన్సిపల్, కరస్పాండెంట్ పట్టా ఆదినారాయణ వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో వర్మ దంపతులు, హైస్కూల్ హెచ్‌ఎం ఎస్‌ఎన్.రాజు దంపతులు భోగి మంటలు వెలిగించి సంబరాలను ప్రారంభించారు. ఉపాధ్యాయులు ప్రకాశరావు, శిరీష, కెవి.రమణ పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని కోరింగ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించిన ఈ సంబరాలను కళాశాల ఛైర్మన్ దున్నా జనార్ధన రావు, కరస్పాండెంట్ ప్రగళ్లపాటి కనకరాజు, డైరక్టర్లు చిట్టూరి కలికిమూర్తి భోగిమంట వెలిగించి ప్రారంభించారు. పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సువర్ణ జ్యోతి, పాఠశాల హెచ్‌ఎం ఉమ, కొమ్మూరి మాలతి పాల్గొన్నారు. పోలేకుర్రు పంచాయతీలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బల్ల సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి ఎన్.జ్యోతి సుధ, ఉప సర్పంచ్ దడాల గణేష్, మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు, వనమాడి రాంబాబు, బత్రాజు నరసయ్య, సమ్మిడి వీర్రాజు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రత్తిపాడు వెలుగు ఎపిఎం వెంకట్రావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం రాచపల్లిలో ప్రకతి వ్యవసాయం సిబ్బంది మహిళా సంఘాల సభ్యులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎపిఎం వెంకట్రావు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.

పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు పర్యవేక్షణలో ఎన్‌టిఆర్ కాలనీలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గుల చిత్రనలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సిఐ కె.క్రాంతి కుమార్, ఎస్‌ఐ వి.మౌనిక పోటీలన పరిశీలించారు.

గొల్లప్రోలు దుర్గాడలోని విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సంక్రాతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరెస్పాండెంట్ సుంకర వీరబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యకలాపాలతో పాటు బోగి మంటలు వేశారు.

కాకినాడ ఎంఎస్‌ఎన్ ఛారిటీస్‌లో సంక్రాంతి సంబరాలు

గండేపల్లి శ్రీగీతం స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కరెస్పాండెంట్ బిఎస్‌పి చౌదరి బహుమతులు అందించారు. సాయంత్రం కబడ్డీ పోటీలతో పాటు, విద్యార్థుల నృత్యాలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు.

జగ్గంపేట జె.కొత్తూరులో హ్యాపీ చిల్డ్రన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కస్పాండెంట్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.వెయ్యి, ద్వితీయ బహుమతిగా రూ.500 ప్రైజ్ మనీ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ శ్రీనివాస్, ఎంపిటిసి మడగల పెద్దకాపు, నర్సే కృష్ణార్జున, నకిరెడ్డి పెదకాపు , కనక దుర్గ ఆలయ కమిటీ ఛైర్మన్ నకిరెడ్డి శివ పాల్గొన్నారు.

పిఠాపురం పట్టణంలోని స్థానిక ఆర్‌ఆర్‌బి హెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రిన్సిపల్ కేశవరావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పాశ్చాత్య పోకడలతో నేటి యువతరం సంస్కృతీ సంప్రదాయాలను మరిచిపోకూడదన్నారు. పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.సుందరయ్య, హుస్సేన్ మోహిద్దీన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కాశీ విశ్వనాథం, డాక్టర్ శారద, ఆఫీస్ హెడ్ సురేష్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో బహుమతులు అందజేస్తున్న ఎపిఎం వెంకట్రావు

శంఖవరంలోని మాధురి విద్యాలయలో సంక్రాంతి సంబరాలు

తాళ్లరేవులోని సత్య సాయి హైస్కూల్లో సంక్రాంత్రి సంబరాలు

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి, రక్తదానం చేసినట్టు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన 63 మంది ఎన్ ఎన్ ఎన్ వాలంటీర్ల, అధ్యాపకులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బ్లడ్ బ్యాంక్‌కు రక్తదానం చేశారు. కళాశాలల సెక్రటరీ, కాకినాడ ఐఆర్‌సిఎస్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి రిబ్బన్ కత్తిరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు సమాజ సేవకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, ప్రిన్సిపల్స్ కె.కరుణ, డి.బ్యూలా, మహమ్మద్ షాహిద్దీన్, సి.సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జి మూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, సురేఖ, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల పరిధిలో శుక్రవారం 216 (ఎ) నెంబర్ గల జాతీయ రహదారి పక్కన బస్‌షెల్టర్ లో సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. దీంతో చొప్పెల్ల వీఆర్ఎ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినామని ఎస్ఐ తెలిపారు. పై వ్యక్తి యొక్క ఆచూకీ తెలిసిన యెడల ఈ కింది నెంబర్లకు సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు. ఆలమూరు ఎస్ఐ సెల్ నెంబరు: 9440904849, రావులపాలెం రూరల్ సిఐ సెల్ నెంబరు 9440796527 ను సంప్రదించవలెను.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - కాట్రేనికోన

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం నడవపల్లి శివాలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న మహిళ మెడలో బంగారపు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశారు. వివరాలు ఇవి.. నడవపల్లి గ్రామానికి చెందిన దీక్షిను సీతామహాలక్ష్మి వైకుంఠ ఏకాదశి సందర్భంగా శివాలయానికి వెళ్లింది. ఆమె తిరిగి వస్తున్న సమయంలో ఆమె మెడలో రెండున్నర కాసుల బంగారపు గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని పరారయ్యాడు. చోరీ పాల్పడిన వ్యక్తి నడవపల్లి వాటర్ ట్యాంకు వైపు వెళ్లిపోయినట్లు బాధితురాలు తెలిపింది. వెంటనే జరిగిన సంఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల శివారున భారత్ పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం జరిగిన లారీ ప్రమాదంలో ఉండి వైష్ణవి(13) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఉండి శ్రీను కుమార్తె పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం గురుకుల పాఠశాలలో చదువుతోంది. సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో గురువారం తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం నభిపేటలో అమ్మమ్మ యేంట్రపాటి సంతోషం ఇంటికి వచ్చింది. కుమార్తెను శుక్రవారం శ్రీను తన బైకుపై ఇంటికి తీసుకెళ్తున్నారు. పెట్రోల్ బంకు సమీపానికి వచ్చే సరికి వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి వీరి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో వైష్ణవి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన శ్రీనును ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నరేంద్రపట్నంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అడ్డనపల్లి తెలిపారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.
పిడిపి 333 బెల్లపు ఊట ధ్వంసం దృశ్యం

వృద్ధుని అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోటకు చెందిన వృద్ధుడు కట్టమూరు రామారావు అదృశ్యంపై సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. బుధవారం మధ్యాహ్నం సామర్లకోటలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటినుంచి తెలిసిన బంధువుల, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆయన ఆచూకీ దొరకలేదన్నారు. ఆయనకు అవసరమైన మందులు, సెల్ ఫోన్ ఇంటి వద్దనే వదిలేసినట్లు బంధువులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9492314822, 8522848283 నెంబర్లకు సమాచారం అందించాలని కుమారుడు సత్తిబాబు, కుటుంబ సభ్యులు కోరారు.

పెద్దేవంలో బరిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

మూడు చోట్ల బరులు ధ్వంసం

ప్రజాశక్తి - తాళ్లపూడి

సంక్రాంతి పండుగను సంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని తహశీల్దార్ రవీంద్రనాథ్, ఎస్ఐ టి.రామకృష్ణ ప్రజలకు సూచించారు. పండుగ దగ్గర పడుతున్న వేళ కొంత మంది కోడి పందేల నిర్వహణకు బరులు సిద్ధం చేశారు. పెద్దేవం, అన్నదేవరపేట, గజ్జరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన మూడు బరులను సిఐ విజయబాబు, ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. అన్నదేవరపేట, గజ్జరం గ్రామాల్లో తహశీల్దార్ రవీంద్రనాథ్ పర్యటించారు. జూదాలకు దూరంగా ఉండాని ప్రజలకు సూచించారు.

ఆర్‌టిసి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎపిఎస్ఆర్‌టిసి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. గతేడాది డిసెంబర్ 20 నుంచి ఈ నెల 19వరకు మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ రాజమహేంద్రవరం బస్సు కాంప్లెక్స్ నుంచి బయలుదేరి షెల్టన్ హోటల్, శీలం నూకరాజు కాంప్లెక్స్, జాగృతి బ్లడ్ బ్యాంక్, రామాలయం, పాత సోమాలమ్మ గుడి మీదుగా రాజమహేంద్రవరం కాంప్లెక్స్ వరకూ సాగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రజా రవాణా అధికారి కె.షర్మిల అశోక మాట్లాడుతూ ఎపిఎస్ఆర్‌టిసిలో డోర్ డెలివరీని ప్రారంభించామన్నారు. 80 పట్టణాల్లో 10 కిలోమీటర్ల వరకు 50 కేజీల వరకు పార్శిళ్లను నేరుగా ఇళ్లకే చేరవేస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షబ్నం, తూర్పుగోదావరి జిల్లా ఎటిఎం కె.మాధవ, ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజీ సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది, సింగు సొల్యూషన్స్ సిబ్బంది, హమాలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తొక్కిసలాట

మాజీ ఎంపీ జివి.హర్షకుమార్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తిరుపతిలో తొక్కిసలాట ఘటన చోటుచేసుకుందని మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ అన్నారు. శుక్రవారం రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజుకు రూ.4 కోట్ల ఆదాయం వచ్చే ఆలయంలో ఇలాంటి దారుణమైన ఘటన జరగడం క్షమించరానిదన్నారు. టిటిడిలో టికెట్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని విమర్శించారు. కొన్ని నెలల క్రితం తిరుమల లడ్డు కల్తీపై గళమెత్తిన పీఠాధిపతులు, మతాధిపతులు ఈ తొక్కిసలాట ఘటనపై మౌనం వహించడం సరికాదన్నారు. లడ్డు కన్నా మనిషి ప్రాణాలు వారికి చిన్నవిగా కనిపిస్తున్నాయా? అని ప్రశ్నించారు. హైదరాబాదులో ఒక హీరో వల్ల ఒక మనిషి ప్రాణం పోతే అతనిపై క్రిమినల్ కేసు పెట్టి అరెస్టు చేశారని, మరి తొక్కిసలాట ఘటనలో ఆరుగురు చనిపోతే ఇంతవరకు ఏ ఒక్కరిపైనా ఎందుకు కేసులు నమోదు చేయలేదన్నారు. హైదరాబాదులో హీరో అల్లు అర్జున్ మృతురాలి కుటుంబానికి రూ.2కోట్ల సాయం చేస్తే ఇక్కడి ప్రభుత్వం మాత్రం తొక్కిసలాట ఘటనలో మరణిస్తే రూ.25 లక్షల పరిహారం ప్రకటించి చేతులు దులిపేసుకుందన్నారు. తొక్కిసలాట ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని, రెండు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే నేరుగా కోర్టును ఆశ్రయించి పిటిషన్ వేస్తానన్నారు. నరేంద్ర మోడీ విశాఖ ప్రయోజనాల కోసం నోరుమెదపకపోవడం దారుణం అన్నారు. 'విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు' అని తెలిసినప్పటికీ దానిపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందన్నారు. ప్రధాని మోడీ పర్యటన కేవలం ఆదానీ ప్రయోజనాల కోసమే సాగిందన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సైతం ప్రధాని పాల్గొన్న సభలో విశాఖ ఉక్కు కోసం మాట్లాడకపోవడం క్షమించరాని నేరమన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇద్దరు పూర్తిగా విఫలమయ్యారన్నారు. వీరు మోడీ భజనలో తరిస్తున్నారన్నారు. ఇష్టం వచ్చినట్లు సినిమా టికెట్ల రేట్లు పెంచడం సరికాదన్నారు. గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వచ్చి ఇద్దరు యువకులు చనిపోతే కేవలం రూ.5 లక్షల చొప్పున ఇచ్చి చేతులు దులిపేసుకున్నారన్నారు. ఇదేనా సినీ పరిశ్రమకు ఉన్న మానవత్వం అని ప్రశ్నించారు. ఇలాంటి ధోరణిని అందరూ ఖండించాలన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

క్రీడల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి ఒక్కరూ చిన్నతనం నుండి క్రీడల్లో పాల్గొంటూ దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదిగి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తహశీల్దార్ రవీంద్రనాథ్, రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షుడు సింహాద్రి జనార్ధనరావు అన్నారు. తాళ్లపూడిలో గల నక్కా చిట్టిబాబు ఇండోర్ స్టేడియంలో తాళ్లపూడి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా చేపట్టిన జిల్లాస్థాయి షటిల్ టోర్నమెంట్‌ను రవీంద్రనాథ్, జనార్ధనరావు ప్రారంభించారు. బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ కోచ్ నాగులకొండ వీరభద్రం పర్యవేక్షణలో ప్రారంభమైన ఈ పోటీలకు జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. 12వ తేదీ వరకూ ఈ పోటీలు జరుగుతాయని బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు నక్కా ఆనందబాబు తెలిపారు. బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.శంకర్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన 60 మంది క్రీడాకారులు ఈ ప్రారంభోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నీలి శ్రీను, ఎ.చంద్రం, వై.కనకం, కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టోర్నీని ప్రారంభోత్సవంలో పాల్గొన్న రవీంద్రనాథ్, జనార్ధనరావు

అక్రమ వసూళ్లలో అధికారుల పాత్ర లేదు

ప్రజాశక్తి- సామర్లకోట

మండల పరిధిలో ఎండియు ఆపరేటర్ల నుంచి ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు చేసిన అక్రమ వసూళ్లపై అధికారులకు ఎటువంటి సంబంధం లేదని తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ కమల స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దారు కార్యాలయంలో ఆయనతోపాటు ఎంఎస్ఒ విలేకరుల సమావేశం నిర్వహించారు. సివిల్ సప్లై కార్యాలయ నిర్వహణకు ఎండియుల ఆపరేటర్ల నుంచి రూ.200లు చొప్పున ఇవ్వాలని తాను వసూలు చేయిస్తున్నట్టు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అసత్యమని డిటి కమల స్పష్టం చేశారు. మండలం ఎండియు ఆపరేటర్ల అధ్యక్షులు దర్శిపాటి సత్యానందం ఎండియు ఆపరేటర్లకు చేసిన ఫోన్ కాల్, వాట్సప్ గ్రూపులో వాయిస్ మెసేజ్‌లు వివిధ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై తాను ఆపరేటర్ల ప్రెసిడెంట్ దర్శిపాటి సత్యానందంకు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. తాను ఎవరి వద్ద నుండి ఏవిధమైన వసూలు చేయమని ఎవరికీ సూచనలు యివ్వలేదని, ఒకవేళ ఎవరైనా తన పేరుతో సొమ్ములు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎండియు ఆపరేటర్ల ప్రెసిడెంట్ దర్శిపాటి సత్యానందంపై చర్యలకు జిల్లా పౌర సరఫరాల అధికారికి నివేదిక పంపినట్టు తహశీల్దారు తెలిపారు.

12, 13 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఈ నెల 12, 13 తేదీల్లో తాళ్ళరేవులో నిర్వహిస్తున్నట్టు ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నరాయణ తెలిపారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఆయన పోటీల నిర్వహణా బృందంతో కలిసి ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. గత 13 సంవత్సరాలుగా పి.మల్లవరంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలు విజయవంతంగా నిర్వహించామని, ఈ సంవత్సరం 14వ సంక్రాంతి సంబరాలు మండల కేంద్రమైన తాళ్లరేవులో నిర్వహించాలని స్థానిక నాయకులు కోరడంతో గాంధీనగర్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పండగ సందర్భంగా కోడి పందాలు, పేకాట, ఇతర జూద క్రీడలకు వెళ్లకుండా ఉండాలనే లక్ష్యం తో ఈ క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. 13వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఈ క్రీడలను ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ప్రారంభిస్తారన్నారు. రెండు రోజులపాటు సాగే ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 20 వాలీబాల్ టీములు పాల్గొంటాయన్నారు. 14వ తేదీ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వాసంశెట్టి శ్రీనివాస్, బర్రె లక్ష్మీ నరసింహ రాజు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, కూటమి నాయకులు బొంతు శ్రీనివాస్, కుడిపూడి మల్లేశ్వరరావు, దున్నా మురళి, సోను, మేడిశెట్టి శ్రీను, దడాల సువర్ణలత, కొప్పిశెట్టి అనంతలక్ష్మి, మేడిశెట్టి శివ, ఫణి, పీడీలు గుత్తుల మల్లేశ్వరరావు, విత్తనాల గురుశంకర్, జక్కల తారక్ పాల్గొన్నారు.

సమస్యలపై సహకార ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-కాకినాడ

సహకార రంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక డిసిసిబి బ్యాంకు వద్ద ఉమ్మడి జిల్లాల ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. జిఒ నెంబర్ 36 ప్రకారం పే స్కేల్ అందరికీ అమలు చేయాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సిఇఒ ఆర్.వి.నరసింహారావుకు వినతిపత్రం అందించారు. అనంతరం నాగమల్లితోట జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకటరామయ్య, రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె.ఆదినారాయణ, కోనసీమ జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ జిఒ నెంబర్ 36 ప్రకారం వేతన సవరణ వెంటనే చెయ్యాలని, ఉద్యోగుల వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, 2019 తరువాత నియమించిన ఉద్యోగులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎస్.నరసరాజు, జి.అప్పలరాజు, మేడిచర్ల రామలింగేశ్వర రావు, కుంపట్ల అయ్యప్ప నాయుడు, మట్టపర్తి జయరామ్, టి.సోమన్న, బి.లీలాకృష్ణ, సిఐటియు నాయకులు పలివెల వీరబాబు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఉత్సాహంగా కలర్స్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో నిర్వహిస్తున్న యువజనోత్సవాలు రెండో రోజు మరింత జోష్‌గా సాగాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు నృత్యాలతో చలికి సైతం చెమటలుఉగ్రూతలు ఊగించాయి. విదేశీ విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఫ్యాషన్ షోలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. మహిళలు,పురుషుల విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో పురుషుల విభాగంలో కెఎల్ యూనివర్సిటీ, మహిళల విభాగంలో ఆదిత్య యూనివర్సిటీ ప్రథమ స్థానంలో నిలిచాయి. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, త్రోబాల్ విభాగంలో పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్ బహుమతులు అందజేశారు.

ఇంటి నుంచే ఉపాధి కల్పన

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో వివిధ చేతి వృత్తిదారులకు ఇంటి నుంచే ఉపాధి పొందే విధంగా శిక్షణ ఇచ్చేందుకు ఇప్పటి వరకు 107 మందిని గుర్తించినట్లు మెప్మా సిఎంఎం భ్రమరాంబ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సర్వీస్ ప్రొవైడర్లకు, హోమ్ ట్రయాంగిల్ సంస్థ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ శిక్షణ నిమిత్తం వృత్తిదారులు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. టిపిఒ ఫణి కుమార్ మాట్లాడుతూ 'వాక్ టు వర్క్ కార్యక్రమంలో మహిళా సంఘాలు, వారి కుటుంబ సభ్యులలో చేతి వృత్తిదారులను గుర్తిస్తున్నామన్నారు.

ఖోఖో జట్టులో కరప విద్యార్థిని

ప్రజాశక్తి -కరప

స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ 2024-25 క్రీడలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. 8వ తరగతి విద్యార్థిని భోగిరెడ్డి పావని శ్రీమణిచంద్రిక విశేష ప్రతిభ కనబరచి ఖో ఖో అండర్-14 విభాగంలో రాష్ట్ర జట్టులో స్థానం సాధించినట్టు తెలిపారు. ఈ నెల 10 నుండి 13 వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయ క్రీడల్లో విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు. పావనిని, పీడీ కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్‌ను ఎస్ఎంసి ఛైర్మన్ దేవు దుర్గారావు, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, మారిశెట్టి రమేష్, బి.స్వర్ణరాణి, టేకుమూడి శ్రీనివాస్, పి.సరోజ, కెఎస్ఎన్.మూర్తి అభినందించారు.

అభివృద్ధి నిర్మాణాల పూర్తి

ప్రజాశక్తి-తొండంగి

మండలంలోని పెరుమాళ్ళపురంలో గ్రామస్తులకు అవసరమైన మౌలిక రహదారుల నిర్మాణాలు పూర్తయినట్టు కార్యదర్శి రాజబాబు తెలిపారు. రూ.1.10 కోట్ల ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరైనట్టు తెలిపారు. కెవి.పురం-1 లో కడారి పేట, పాత చోడిపల్లిపేట, కొత్త చోడిపల్లిపేట, లక్ష్మణుడు పేట, తలపంటిపేట, హుకుంపేట, అవార్డుపాడు, వంటి చిన్న గ్రామాల్లో రూ.8 లక్షల చొప్పున సిమెంట్ రోడ్లు వేశామని తెలిపారు. కెవి.పురం-2లో చింతకాయల పేటలో రూ.9 లక్షలు, బుచ్చయ్యపేటలో రూ.10 లక్షలు, గడ్డిపేటలో రూ.8 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. రూ.19 లక్షలనపు వరదలకు దెబ్బ తిన్న ప్రాంతాల్లో వినియోగించినట్టు తెలిపారు.

ఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పవన్ కళ్యాణ్

ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి - రాజానగరం

ఇటీవల తూర్పు గోదావరి జిల్లా వేమగిరిలో జరిగిన గేమ్ ఛేంజర్ ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో పాల్గొని ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ శుక్రవారం పరిశీలించారు. కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన గురువారం మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా కాకినాడ జిల్లా పిఠాపురానికి బయలుదేరారు. అదేదారిలో రంగంపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. తూర్పు, కాకినాడ కలెక్టర్లు పి.ప్రశాంతి, షాన్ మోహన్ సగిలి, కాకినాడ ఎస్పి విక్రాంత్ పాటిల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎడిబి రహదారి పనులను పరిశీలించారు. రహదారి పనులు మందకొడిగా సాగడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. 2018 నుంచి పనులు సాగుతున్నాయన్నారు. ఆయన వెంట కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్, డిఎస్‌పి భవ్యకిశోర్, ఎపి రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు ఉన్నారు.

ముత్యాలమ్మకు బంగారు కిరీటం అలంకరణ

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

మండలంలోని కె.సావరం ముత్యాలమ్మ జాతరలో భాగంగా శుక్రవారం నూతన స్వర్ణ కిరీటంతో అలంకరించారు. తొలుత ఈ కిరీటాన్ని గ్రామంలోని వాడవాడలా మేళ తాళాలతో ఊరేగించారు. ముక్కోటి ఏకాదశి కూడా కావడంతో మండలంలోని కె.సావరంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.సావరం, టి.వేమవరం, జంగం చెరువు ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జాతరను విజయవంతం చేయాలన్నారు.

వాడి వేడిగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం వాడిగా వేడిగా జరగ్గా బడ్జెట్ ఆమోదం మొక్కుబడిగా సాగించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో కౌన్సిల్ ప్రత్యేక అత్యవసర సమావేశాలు నిర్వహించారు. తొలుత పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు భవనాలు ఉండగా అద్దె భవనాల్లో సచివాలయం నిర్వహించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు మున్సిపల్ అధికారులను నిలదీశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల అద్దెకు బడ్జెట్‌లో పొందుపరిచిన ప్రజాధనం వథా అవుతోందని ప్రశ్నించారు. ఈ విషయమే కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ వార్డులో ఉన్న ప్రజలకు అందుబాటులో ఉండేందుకు అద్దె భవనాలు సచివాలయలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో సమస్య సద్దుమణిగింది. 2024-25 సంవత్సరానికి రూ.9,79,19,205తో మిగులు బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోకిన సునీత దేవి, కౌన్సిలర్లు ఊబా జాన్ మోజెస్, పాగా సురేష్ కుమార్, ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, జట్ల మోహన్, సేపేని సురేష్, పిట్టా సత్యనారాయణ, సల్లూరి కళ్యాణ్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా తొలగిస్తారా..

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

సంఘం సభ్యుల అనుమతి లేకుండా విఒను విధుల నుంచి ఎలా తొలగిస్తారని గ్రూపు ప్రెసిడెంట్లు ప్రశ్నించారు. శుక్రవారం ఉప్పాడ గోలీలపేట వద్ద ఉన్న బాధితురాలు తీరంశెట్టి చిన్ని సంఘం సభ్యులతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళ, నానిష, మమత, శాంతి, రాణి గ్రూపుల అధ్యక్షులు, సభ్యులు మల్లె అమ్మాజీ, రాశిపల్లి వేణు, ఓసుపల్లి, మల్లేశ్వరి పాల్గొని చిన్నిని తొలగించాలని ఎటువంటి తీర్మానాలు చేయకుండానే విధులు నుంచి తొలగించారని తెలిపారు. గతంలో తొలగించిన ఓసుపల్లి కృపను ఎలా విధుల్లోకి తీసుకున్నారో తెలపాలన్నారు. గతంలో గ్రూపుల వద్ద సొమ్ములు కాజేసినందుకు కృపను తొలగించారని తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే తొక్కిసలాట

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రభుత్వ వైఫల్యం అధికారులు నిర్లక్ష్యమే తిరుపతిలో తొక్కిసలాటకు దారి తీసిందని వైసిపి ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ముద్రగడ నివాసంలో శుక్రవారం మండలంలో టి.రాయవరం, యుజె.పురం నుంచి వైసిపి కార్యకర్తలు మాజీ మంత్రి వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం, కో ఆర్డినేటర్ గిరిబాబును కలిశారు.కార్యకర్తలతో గిరిబాబు మాట్లాడుతూ చంద్రబాబు నేతలపై కేసులు పెట్టడం, వేధింపులు మీద ఉన్న శ్రద్ధ భక్తుల మీద లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బత్తుల నాగార్జున, ఎంపీటీసీ తటవర్తి రామన్న దొర, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పవన్‌కు ఎంఎల్ఎ వినతి

ప్రజాశక్తి ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు కేటాయించాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభ విన్నవించారు. పిఠాపురంలో మంత్రి పవన్ కళ్యాణ్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధికి సహకారం అందించినందుకు పవన్ కళ్యాణ్‌కు ఎంఎల్ఎ సత్యప్రభ ధన్యవాదాలు తెలిపారు.

రెవెన్యూ సదస్సుల్లో 261 దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణం, మండల పరిధిలోని గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో సమస్యలు పరిష్కారం కోరుతూ ప్రజల నుండి 261 దరఖాస్తులు అందాయని తహశీల్దారు సిహెచ్ వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలిపారు.

మరిడమ్మ ఆలయంలో జడ్జి పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారిని శుక్రవారం పెద్దాపురం 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆసాదులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

యానాం వార్తలు

సంతోష్ కుమార్‌తో కృష్ణారావు

రోడ్ల నిర్మాణానికి నిధులను కేటాయించాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం ఢిల్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా యానాం నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్, సభ్యుడు కె.వెంకటరమణతో భేటీ అయ్యారు. యానాంను ఆనుకొని ఉన్న జాతీయ రహదారి అభివృద్ధికి సంబంధించిన నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

భోగి మంట వద్ద సంబరం

ఉమా పాఠశాలలో సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక బీచ్ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో సెంటర్ ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సంక్రాంతి పండుగ విశిష్టత తెలియజేసి వారిని వివిధ వేషధారణల్లో తీర్చిదిద్దారు. అనంతరం మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, డాన్స్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి సహదేవ రాజు, శ్రీదేవి, అన్నపూర్ణ సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జివిఎస్.తాతారావు, ప్రత్యేక ఉపాధ్యాయిని ఎం.సుశీల, మహేశ్వరి, వీరవేణి దుర్గ పాల్గొన్నారు.

పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు

ఎంఎల్ఎ అశోక్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - యానాం

ఒఎన్‌జిసి పరిహారం యానాంలోని మత్స్యకారులకు త్వరితగతిన విడుదల కావడానికి, పరిహారం సొమ్ము వారి ఖాతాలకు జమ చేసే విధంగా యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఎంతో కృషి చేశారని ఆయనకు మత్స్యకారులు ధన్యవాదాలు తెలిపారు. ఒఎన్‌జిసి పరిహారం లబ్ధిదారుల ఖాతాలకు జమ కావడంతో ఆయా గ్రామాలకు చెందిన పలువురు మత్స్యకారులు ఎంఎల్ఎ అశోక్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తూ, బాణసంచా కాల్చారు. స్వీట్లు పంచుతూ సందడి చేశారు.

రాపాకలో గోకులం షెడ్డుకు ఎంఎల్ఎ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - సీతానగరం

రాపాక గ్రామంలో ఉపాధి నిధులతో నిర్మించిన గోకులం షెడ్డును రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆశయ సాధనలో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. పాడి పంటలతో సంతోషంగా ఉండాలన్నారు. నియోజకవర్గానికి ఇప్పటి వరకు 200 గోకులాలు మంజూరయ్యాయన్నారు. మంజూరైన వాటిలో కొన్ని నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో 30 గోకులాలు ప్రారంభించి రైతులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భారతి, ఎపిఒ నాగశేషవేణి, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నేను, **చెట్టే సుభాషిణి,** తండ్రి: చెట్టే సత్తియ్య, ప్రస్తుత నివాసం: శింగవరం, నిడదవోలు మండలం, తూ.గో.జిల్లా ఇందుమలముగా తెలియజేయునది ఏమనగా, నాకు చెందిన **ఇంటి డాక్యుమెంట్ నెం.5900/2012, తేది.21-09-2012** గల ఒరిజినల్ డాక్యుమెంట్స్ **ది.02-01-2025** తారీఖున నిడదవోలు పట్టణంలో ఐసిఐసిఐ బ్యాంక్ నందు లోన్ నిమిత్తం వేళుతుండగా గణేష్ చౌక్ సెంటర్ నందు ఆటో దిగుతుండుగా పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. నేను చుట్టుప్రక్కల విచారించిననూ దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో గాని, నా సెల్ నెం. **91214 80557** నందు గాని తెలియజేయగలరు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో (సీనియర్ డివిజన్)

I.A. 1502/2016, I.A. 534/2011

Between:

పిటీషనరు (వాది): దేవరపు రాంబాబు, S/o. లేటు వెంకన్న, వయస్సు 58 సం॥లు, వ్యవసాయం, సా॥ ముగ్గళ్ళ, గణపవరం మండలం, ప॥గో॥జిల్లా.

Vs

రెస్పాండెంట్లు (ప్రతివాద్లు):

1. గుంటూరు సామ్రాజ్యం (died)
2. గుంటూరు సత్యనారాయణరెడ్డి
3. గుంటూరు శ్రీనివాసులు రెడ్డి

4వ రెస్పాండెంటు: గుంటూరు తిరుమల రెడ్డి, S/o. సత్యనారాయణరెడ్డి, ప్రైవేటు ఎంప్లాయి, కుమ్మల వీధి, సా॥ నిడదవోలు, నిడదవోలు మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు పిటీషనులో 4వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా, రిజిస్టరు పోస్టు ద్వారా నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-01-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

ఎస్.సుబ్బారావు
కొవ్వూరు అడ్వకేట్, కొవ్వూరు
ది.08-01-25 సెల్: 9492917811